కాలుష్యకారక కంపెనీలు మాకొద్దు

- ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్తులు
- ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం: ఏసీ వెంకటేశ్వర్లు

ప్రజాభిప్రాయసేకరణలో మాట్లాడుతున్న గ్రామస్తులు

శివ్వంపేట, ఆగస్టు 20: పచ్చటి భూముల్లో కాలుష్యకారక కంపెనీలు తమకొద్దని మండలంలోని నవాబ్‌పేట గ్రామస్తులు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు తెలిపారు. మంగళవారం రెవెన్యూ శివారు సర్వేనంబర్ 301లో నిర్మించ తలపెట్టిన హైపా లైఫ్ సైన్సెస్ లిమిటెడ్ కంపెనీపై ఏసీ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. గతంలో నిర్మించిన కాలుష్యకారక కంపెనీలతో ఇప్పటికే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు తెలిపారు. బాయిలర్ అంటేనే విషం చిమ్మే గొట్టమని, అలాంటివి ఇక్కడ నిర్మించొద్దని అన్నారు. ఈ విషయమై ఏసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు, ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, తహసీల్దార్ కమలాద్రి, పీసీబీ అధికారులు, లచ్చిరెడ్డిగూడెం, శివాయిగూడెం, రాములుతండా, నల్లవల్లి, నాగిరెడ్డిగూడెం గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

పెద్దశంకరంపేట,ఆగస్టు 20: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించుకోవాలని ఎన్‌హెచ్ఐ హైదరాబాద్ రీజినల్ అధికారి షేక్ రజాక్ అన్నారు. మంగళవారం సేనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సెంటర్ ఆధ్వర్యంలో జంబికుంట వద్ద ఏక్ పెడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీడీ మధుసూదన్‌రావు, గజ్వేల్ జాయింట్ అడ్మినర్ రాజారావు, మహమ్మద్ రెహమాన్, రవిశంకర్, వసుంధర, పేట ప్రాజెక్ట్ హెడ్ సుధాకర్‌రెడ్డి, ఐఎంఎస్ మూనేజర్ ఖాజామొయినోద్దిన్, తదితరులున్నారు.

డిగ్రీ కళాశాలలో ఘనంగా వృక్షా రక్షాబంధన్

వృక్షాలకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 20: జిల్లా కేంద్రంలోని మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా వృక్షా రక్షాబంధన్ నిర్వహించారు. కళాశాలలోని వృక్షాలకు విద్యార్థులు రాఖీలు కట్టి, వాటిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హుస్సేన్ మాట్లాడుతూ సృష్టిలో ప్రతి ప్రాణికి, ప్రతి దశలో చెట్లు ఆహారం, గాలిని అందిస్తున్నాయన్నారు. వృక్షాలకు రక్షించడం మనందరి బాధ్యత అన్నారు.

సరస్వతీ యజ్ఞానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

చేగుంట, ఆగస్టు 20: మండలంలోని బోనాల శ్రీనివాస్ బిన్ని మాడ్రన్ రైస్ మిల్‌లో ఈనెల 25న నిర్వహించే 494వ సరస్వతీ యజ్ఞానికి రావాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఇమ్మడి లక్ష్మణ్ ఆహ్వాన పత్రిక అందజేశారు.

పట్టాపాస్‌బుక్ వారీగా పంట రుణమాఫీ జరగాలి

నిజాంపేట, ఆగస్టు 20: పట్టాపాస్‌బుక్ వారీగా రూ.2 లక్షల పంట రుణాన్ని ప్రభుత్వం మాఫీ చేయాలని భారతీయ కిసాన్ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు రాజం డిమాండ్ చేశారు. ఒకే రేషన్‌కార్డు ఉండి, ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు రైతుల రుణం రూ.2 లక్షల పైగా ఉన్నా రుణమాఫీ కాలేదన్నారు. ఆయనతో కమిటీ సభ్యుడు రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

రుణమాఫీ దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు

చిలిపిచెడ్, ఆగస్టు 20: మూడో విడత లోనూ రుణమాఫీ కాక ఆగమైతున్న రైతుల దరఖాస్తులను చిలిపిచెడ్ రైతువేదికలో వ్యవసాయాధికారులు మంగళవారం నుంచి తీసుకుంటున్నారని ఏవో రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. రూ.2 లక్షల రుణమాఫీ కాని వారు, తప్పుఒప్పులు ఉన్నవారు దరఖాస్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు భూపాల్, రమ్య, యాదిరెడ్డి, స్వామి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించిన జడ్పీ సీఈవో

నర్సాపూర్, ఆగస్టు 20: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని జడ్పీ సీఈవో ఎల్లయ్య, మంగళవారం అన్యువల్ ఇన్స్‌పెక్షన్‌లో భాగంగా సందర్శించారు. కార్యాలయానికి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ సీఈవో రంగచారి, జడ్పీ సూపరింటెండెంట్ మానయ్య, ఎంపీడీవో మధులత, సూపరింటెండెంట్ రామ్‌మనోహర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

చిలిపిచెడ్ ఏవోగా రాజశేఖర్ గౌడ్

చిలిపిచెడ్, ఆగస్టు 20: చిలిపిచెడ్ మండల వ్యవసాయాధికారిగా రాజశేఖర్ గౌడ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన బాల్‌రెడ్డి హవేళీ ఘనపూర్‌కు బదిలీపై వెళ్లారు. ఆగ్రో రైతు సేవా కేంద్రం యజమాని శ్రీనివాస్, నర్సింహారెడ్డి, సయ్యద్ హుస్సేన్, వీరాస్వామి, గోపాల్‌రావు, యాసీన్ సన్మానించారు.

గొట్టిముక్లలో కూలిన ఇల్లు

పెద్దశంకరంపేట, ఆగస్టు 20: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని గొట్టిముక్ల గ్రామంలో అలి గె కిష్టమ్మకు చెందిన పెంకుటిల్లు కూలింది. కిష్టమ్మ కుటుంబీకులు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

రైతులందరికీ పంట రుణమాఫీ చేయాలి

- అవగాహన లేని కాంగ్రెస్ మంత్రులు
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు
- రుణమాఫీ కాలేదని రైతుల నిరసన

చిలిపిచెడ్ రైతు వేదిక వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

రామాయంపేటలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

రామాయంపేట, ఆగస్టు 20: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంట రుణమాఫీ రైతులందరికీ అందాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం రామాయంపేట ఉమ్మడి మండల అభినందన సమావేశానికి విచ్చేసిన ఎంపీని కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రులు రుణమాఫీపై అవగాహన లేకుండా మాట్లాడడం పద్ధతి కాదన్నారు. రాష్ట్రంలోని రైతులందరికీ రుణమాఫీ కావాల్సిందేనన్నారు. మెదక్ ఎల్కతుర్తి రోడ్డు విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడి వర్తక, వాణిజ్య వ్యాపారులకు న్యాయం చేస్తానన్నారు. అక్కన్నపేట రైల్వేస్టేషన్‌లో అన్ని రైల్లు నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ సత్తా చాటుతుందన్నారు. కార్యక్రమంలో మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు దయానందరెడ్డి, పట్టణ అధ్యక్షుడు భానుచందర్, శంకర్‌గౌడ్, రాములు, సిద్దిరాములు, శంకర్‌గౌడ్, చంద్రశేఖర్, సంజీవరెడ్డి ఉన్నారు.

రుణమాఫీ కాలేదని రైతుల నిరసన

చిలిపిచెడ్,ఆగస్టు 20: రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ చిలిపిచెడ్ రైతు వేదిక వద్ద ఆయా గ్రామాల రైతులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని జిల్లా రైతు సమన్వయ మాజీ సభ్యుడు సయ్యద్ హుస్సేన్, రైతుబంధు అజ్జమర్రి మాజీ అధ్యక్షుడు వీరాస్వామి, సోమక్కపేట సొసైటీ మాజీ డైరెక్టర్ తేజా నాయక్ హెచ్చరించారు.

సగం మంది రైతులకే పంట రుణమాఫీ

రైతులందరికీ పంట రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ బెస్త లక్ష్మణ్ అన్నారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దాడి చేయడం సిగ్గు చేటున్నారు. రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలయ్యేలా ప్రభుత్వం చూడాలన్నారు. ఆయనతో సామ్యా తండా మాజీ సర్పంచ్ భిక్షపతి నాయక్ ఉన్నారు.

రైతులను అరెస్టు చేయడం సబబుకాదు: మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 20: పంట రుణమాఫీ కాలేదని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులను పోలీసులు అక్రమ అరెస్టు చేయడం సబబుకాదని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి ప్రకటనలో ఖండించారు. రుణమాఫీ కాని రైతులు కార్యాలయాల చుట్టూ, బ్యాంకుల చుట్టూ తిరుగుతూ కాళ్లు అరిగేలా తిరిగి, విసిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందోళనలకు దిగిన రైతులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి

- పుట్‌బాల్ జట్టును అభినందించిన కలెక్టర్ రాహుల్‌రాజ్
- ఇన్‌స్పైర్ మనక్ గోడ పత్రిక ఆవిష్కరణ

పుట్‌బాల్ క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 20: రాష్ట్రస్థాయి మహిళల పుట్‌బాల్ పోటీల్లో రన్నరప్‌గా నిలిచిన ఉమ్మడి మెదక్ జిల్లా జట్టును కలెక్టర్ రాహుల్ రాజ్ అభినందించారు. మంగళవారం తన చాంబర్‌లో పుట్‌బాల్ క్రీడాకారిణులు, జాతీయస్థాయి జూనియర్ పుట్‌బాల్ పోటీల్లో బంగారు పథకం సాధించిన అంకిత్‌ను అభినందించారు. మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియం మరమ్మతులు ఇప్పటికే పూర్తి చేసి పుట్‌బాల్ క్రీడామైదానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని కలెక్టర్ తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న శిక్షకులు నాగరాజు, ప్రకాశ్, వినయ్, భాగ్యమ్మ, బాణి, అకాడమీ సభ్యులను కలెక్టర్ అభినందించారు.

నామినేషన్లను అప్‌లోడ్‌చేయాలి

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల నుంచి ఐదు నామినేషన్లను ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 15వ తేదీలోగా అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన చాంబర్‌లో డీఈవో రాధాకిషన్, డీఎస్‌వో రాజిరెడ్డితో కలిసి ఇన్‌స్పైర్ మనక్ గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అర్హత గల అన్ని పాఠశాలల్లోని విద్యార్థుల నామినేషన్లను సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లా నుంచి ఎక్కువ మంది ఎంపికయ్యేలా కృషి చేయాలన్నారు. జాతీయ ఇన్నోవేషన్ ఫౌండేషన్ శాస్త్రవేత్తలు వీటిని పరిశీలించి అర్హత కలిగిన ప్రాజెక్టులకు రూ.10 వేలు సంబంధిత విద్యార్థి ఖాతాలో వేస్తారన్నారు.

ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో పని చేయాలి

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

- ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల సంఖ్య పెంచాలి
- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, ఆగస్టు 20: ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో పనిచేయాలని, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల సంఖ్య పెంచాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అధ్యర్యంలో నెలవారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల్లో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో తమ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలను సందర్శించాలని , ట్రబుల్ మాంగర్స్ తరచుగా తగాదాలకు, నేరాలకు పాల్పడేవారిపై నిఘా ఉంచాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకషంగా పరిశోధించి ఫైనల్ చేయాలని సూచించారు. పోక్సో గ్రేవ్ కేసుల్లో త్వరతగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు.

పోలీస్ డ్రైవర్లు అందుబాటులో ఉండాలి

డయల్ 100 సిబ్బంది ప్రజలపై బాధ్యతగా మెలగాలని, అత్యవసర సమయంలో అందుబాటులో ఉండాలని ఎస్పీ తెలిపారు. జిల్లా సాయుధ దళ డీఎస్పీ రంగనాయక్ అధ్వర్యంలో జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల, సర్కిల్ కార్యాలయాల వాహనాల తనిఖీల్లో భాగంగా పనితీరు, వాటి కండిషన్ల పరిస్థితిని ఎస్పీ తనిఖీ చేశారు. జిల్లాలోని ఇన్నోవా, బొలెరో కార్ల డ్రైవింగ్ విధానం, ఎయిర్ బ్యాగ్స్, బ్యాటరీ, అధునాతన సదుపాయాలపై అవగాహన కల్పించారు. ఎస్పీతో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, ఆర్ఐ శైలేందర్, సిబ్బంది ఉన్నారు.

ఏడుపాయల్లో నేరాలు జరగకుండా పటిష్టచర్యలు

పాపన్నపేట్, ఆగస్టు 20: ఏడుపాయల్లో నేరాలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన ఏడుపాయల్లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. మంజీరా నదిలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలిగించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. నదిలో స్నాన ఘాట్టాలు నిర్మించి, చూట్టూరా ఫెన్సింగ్ వేయాలని సూచించారు. ఇందుకు నిధులు అవసరం అవుతాయని, ఉన్నతాధికారుల నుంచి అనుమతి పొందాలని ఈవో కృష్ణప్రసాద్‌కు సూచించారు. సీసీ కెమెరాలు, సెక్యూరిటీ పెంచాలని ఆదేశించారు. అపరిచితులు, అనుమానాస్పద స్థితిలో ఎవరైనా కనిపిస్తే విచారించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, పాపన్నపేట్ ఎస్సై శ్రీనివాస్‌గౌడ్, ఇరిగేషన్ అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్ కుటుంబానికి పోలీసుల ఆర్థిక సాయం

రామాయంపేట, ఆగస్టు 20: రామాయంపేట పోలీస్‌స్టేషన్‌లో కొంతకాలంగా స్వీపర్‌గా పని చేస్తున్న చాకలి మణెమ్మ భర్త శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతుడి ఇంటికెళ్లి మణెమ్మకు రూ.20 వేల నగదును అందజేశారు.

పెద్దశంకరంపేట బంద్ ప్రశాంతం

ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ఐక్యవేదిక సభ్యులు

పెద్దశంకరంపేట, ఆగస్టు 20: హిందూ సంఘాల ఆధ్వర్యంలో పెద్దశంకరంపేటలో మంగళవారం నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అఘాయిత్యాలు, దాడులకు నిరసనగా స్వచ్ఛందంగా బంద్ చేశారు. పట్టణంలోని రామాలయం నుంచి పురవీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, బీజేపీ మండల అధ్యక్షుడు విఠల్, సతీశ్‌గౌడ్, సీతారామారావు, రవివర్మ, వీరప్ప, శ్రవణ్ ఉన్నారు.

చిలిపిచెడ్ నుంచి సిద్దిపేటకు తరలివెళ్లిన బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేటకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

చిలిపిచెడ్, ఆగస్టు 20: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దాడికి నిరసనగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు చిలిపిచెడ్ మండల నాయకులు తరలివెళ్లారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బెస్త లక్ష్మణ్, ఆయా గ్రామాల సర్పంచులు గోపాల్‌రెడ్డి, దివ్య మహిపాల్‌రెడ్డి, యాదగిరి, శంకర్‌నాయక్, భిక్షపతినాయక్, అంబర్‌సింగ్ తదితరులు ఉన్నారు.

సిద్దిపేటకు శివ్వంపేట నాయకులు

శివ్వంపేట, ఆగస్టు 20: మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రమణాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ ఆధ్వర్యంలో సిద్దిపేటకు తరలివెళ్లారు. వాడెవ్వడూ వీడెవ్వడూ హరీశన్నకు అడ్డెవ్వడు అంటూ నినాదాలు చేశారు. వెంకట్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, యాదాగౌడ్, మహేందర్‌రెడ్డి, ఆంజనేయులు, ప్రభాకర్‌రెడ్డి, నరేందర్, శ్రీశైలంయాదవ్, చెన్నానాయక్, రాజునాయక్ తరలివెళ్లారు.

సిద్దిపేటకు వెళ్తున్న శివ్వంపేట బీఆర్ఎస్ నాయకులు

మున్నూరుకాపు కార్పొరేషన్‌కు నిధులివ్వాలి

మౌన దీక్షలో మున్నూరుకాపు సంఘం నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 20: మున్నూరు కాపు కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయాలని మున్నూరుకాపు మహాసభ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు బండ నారాయణ అన్నారు. సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో మౌన దీక్ష చేపట్టారు. ప్రతి బడ్జెట్‌లో రూ.3వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 24 శాతం ఉన్న మున్నూరుకాపులకు రెండు మంత్రి పదవులు కేటాయించాలని కోరుతూ ఒక రోజు మౌనదీక్ష చేపట్టినట్లు ఆయన వివరించారు. దీక్షలో జిల్లా అధ్యక్షుడు బట్టి ఉదయ్‌పటేల్, కోఆర్డినేటర్ వీర్‌కుమార్, జిల్లా నాయకులు మహిపాల్, గట్టేశ్, ప్రసాద్, విజయ్, అశోక్, మల్లేశం, శేఖర్, వినోద్, అవినాశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నిజాంపేట, ఆగస్టు 20: ఖాసీంపూర్‌కు చెందిన మల్లేశం బతుకుదెరువు కోసం మేడ్చల్‌కు వెళ్లి అక్కడ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, నారాగౌడ్, నర్సింహులు ద్వారా బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటానికి సిద్ధంకావాలి

నర్సాపూర్, ఆగస్టు 20: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయడానికి మేధావులు, కవులు, న్యాయవాదులు, పాత్రికేయులు సిద్ధం కావాలని జాతీయ మాల మహానాడు జిల్లా యూత్ ప్రెసిడెంట్ దాడిగా నరేశ్ పిలుపునిచ్చారు. పోరాడకపోతే మాలలు అస్తిత్వం కోల్పోతామన్నారు. బుధవారం నర్సాపూర్‌లోని ప్రైవేట్ విద్యాసంస్థలు, దుకాణాలు, బస్సులు స్వచ్ఛందంగా బంద్ చేయాలన్నారు. నర్సాపూర్ చౌరస్తాలో ధర్నా చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు జిల్లా బంద్

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 20: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో నేడు జిల్లా బంద్‌ను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవ, ఉపాధ్యక్షుడు జెల్ల రమేశ్, పట్టణ అధ్యక్షుడు బత్తుల ప్రసాద్ కోరారు.

రాఖీకి అనుమతివ్వని అధికారులను సస్పెండ్ చేయాలి

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 20: రాఖీలు కట్టడానికి వెళ్లిన వారిని అనుమతివ్వని అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, లక్ష్మన్ డిమాండ్ చేశారు.

ఏడుపాయల ఇన్‌చార్జి ఈవోగా చంద్రశేఖర్

పాపన్నపేట, ఆగస్టు 20: ఏడుపాయల ఇన్‌చార్జి ఈవోగా ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌ను నియమిస్తూ దేవాదాయ ధర్మదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేసిన డీసీ కృష్ణప్రసాద్‌ను దేవాదాయ ధర్మదాయశాఖకు బదిలీ చేశారు

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

దూదేకుల గౌసోద్దీన్

కొల్చారం, ఆగస్టు 20: పురుగు మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన కొల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న ఘనపూర్ గ్రామానికి చెందిన దూదేకుల గౌసోద్దీన్ (50) గ్రామంలో హోటల్ నడుపుతూ జీవిస్తున్నాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నది. ఈ నెల 19న మృతుడు గౌసోద్దీన్‌కు అతని భార్యకు గొడవ జరిగింది. విషయం తెలుసుకున్న పెద్ద కొడుకు షాబోద్దీన్ ఇంటికొచ్చి తల్లిదండ్రులను సముదాయించి వెళ్లిపోయాడు. తర్వాత కోపంతో ఇంట్లో నుంచి వెళ్లిన గౌసోద్దీన్ గ్రామ శివారులోని క్రికెట్ గ్రౌండ్ సమీపంలో పురుగు మందు తాగి పడి ఉన్నాడు. ఇదే గ్రామానికి చెందిన భూమ్ కృష్ణ గమనించి కుటుంబీకులకు తెలిపాడు. వారు బాధితున్ని హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతిచెందాడు. ఈ మేరకు ఎస్సై గౌస్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెదక్ తహసీల్దార్‌గా లక్ష్మణ్‌బాబు

మెదక్‌రూరల్, ఆగస్టు 20: మెదక్ తహసీల్దార్‌గా లక్ష్మణ్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. పాపన్నపేట తహసీల్దార్ లక్ష్మణ్ బాబు బదిలీపై వచ్చారు.

చేగుంట తహసీల్దార్‌గా నారాయణ

చేగుంట, ఆగస్టు 20: హవేళీఘనపూర్ నుంచి బదిలిపై వచ్చిన సీ.నారాయణ చేగుంట తహసీల్దార్‌గా మంగళవారం బాధ్యతలు చేపట్టారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునదేమనగా, నా క్లయింట్ స్క్వేర్ వి ఇంజినీరింగ్ ఎంటర్‌ప్రైజెస్, ప్రాతినిధ్యం వహిస్తున్నవారు దాని భాగస్వాములు 1. శ్రీ కొబ్బరి వెంకటేశ్వర్లు, నివాసం: ఇం.నెం.32-132, హాల్ కాలనీ, ఏఎమ్ఆర్ స్కూల్ ఎదురుగా, గాజుల రామారం, కుత్బుల్లాపూర్ మండలం మరియు M-M జిల్లా మరియు 2. శ్రీ గోవిందయ్య కొబ్బరి నివాసం: ఫ్లాట్ నెం. 202, బాలాజీ ఎన్‌క్లేవ్, బండారి లేఅవుట్, రోడ్ నెం.5ఎ, నిజాంపేట్, M-M జిల్లా వారు తెలంగాణ రాష్ట్రం, మెదక్ జిల్లా, మనోహరాబాద్ మండలం, కల్లకల్ గ్రామం వద్ద గల సర్వే నెం.398లో 12 గుంటలు లేదా 1452 చ.గజాలు ఎన్నర్రపు భూమిని తగిన అమ్మకం ప్రతిఫలానికి కొనుగోలు చేయడానికి 17-06-2024 తేదీనాటి అమ్మకం ఒప్పందం కుదుర్చుకున్నారు మరియు దాని యజమానులు అనగా ఎస్ఆర్ఓ తూప్రాన్, మెదక్ జిల్లా వద్ద 23-10-2017 తేదీనాటి డాక్యుమెంట్ నెం.2823 ఆఫ్ 2017 కలిగిన రిజిస్టర్ సేల్ డీడ్ ద్వారా సదరు ఆస్తిని కొనుగోలు చేసినవారు శ్రీ నాగేంద్ర కుమార్ జయవరపు వారికి అమ్మకం ప్రతిఫలంలో భాగంగా బయానాగా కొంత మొత్తాన్ని చెల్లించారు. నా క్లయింట్ పేరున రిజిస్టర్ సేల్ డీడ్ ద్వారా బదిలీ చేయబడు పైన తెలిపిన అమ్మకం లావాదేవీకి సంబంధించి ఏదేని అభ్యంతరం లేదా ఏదేని క్లెయిలు, తనఖా, హక్కు లేదా టైటిల్ కలిగిన ఎవరేని వ్యక్తి లేదా వ్యక్తులు ఈ బహిరంగ ప్రకటన తేదీ నుండి 7 రోజులలోగా సంబంధిత డాక్యుమెంట్లతో దిగువ తెలిపిన చిరునామాలో సంప్రదించండి, లేనిపో నా క్లయింట్ పైన తెలిపిన సదరు యజమానికి మిగిలిన అమ్మకం ప్రతిఫలాన్ని చెల్లించి అతని పేరుపై సదరు ప్లాట్ రిజిస్ట్రేషన్ పొందులలో తదుపరి ముందుకు సాగుతారు మరియు ఆతరువాత చేసిన క్లెయింలు చెల్లనివిగా భావించబడును మరియు ఆతరువాత చేసిన క్లెయింలకు నాక్లయింట్ కట్టుబడి ఉండరు.

సం/- ప్రభాకర్ రెడ్డి గిద్దలపాటి
అడ్వకేట్ & లీగల్ కన్సల్టెంట్
కార్యాలయ చిరునామా:
నెం.6-3-662/ఎ/బి/ఎమ్5, 1ఎ అంతస్తు, మాస్టర్ సాయి అపార్ట్‌మెంట్స్, సంగీత్ నగర్ కాలనీ, నిమ్స్ హాస్పిటల్ ఎదురుగా, పంజాగుట్ట, హైదరాబాద్-500082, నెం.040-23405588, ఫ్యాక్స్: 040-23310798, మొబైల్ నెం.9989645588

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★త్రివ